క్లుప్తంగా

అమావాస్య పూజలు



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో బుధవారం అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతా నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామి దర్శనానికి తరలిరావడంతో దర్గా పరిసరాలు సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి అనుమతించారు.

నివాళి



విజయభాస్కర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: దేశంలో మచ్చలేని నాయకుడిగా కోట్ల విజయభాస్కర్ రెడ్డి జీవితం కొనసాగించారని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీరాయచోటి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుదువారం విజయభాస్కర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని భీమాస్ సర్కిల్ కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీ చైర్మన్‌గా, ముఖ్యమంత్రి, కేంద్రన్యాయశాఖ మంత్రిగా ఆయన సేవలను కొనియడారు. నాయకులు నసీరుద్దీన్ పటేల్, దేవిశెట్టి ప్రకాశ్, నీలకంఠప్ప, సుగూరప్ప, అవ్వబ్యాంకు సీఈఓ గట్టు మురళీకుమార్, లక్ష్మణయ్యశెట్టి, పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోండి

ఆదోనిఅర్బన్ : పట్టణశివారులోని శిల్పా సౌభాగ్యనగర్‌లో వెలిసిన తాయమ్మ దేవాలయ పూజారిని ఓ వ్యక్తి దుర్భాషలాడి కించపరిచారని, ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శివనారాయణస్వామికి పలువురు బుధవారం ఫిర్యాదు చేశారు. కునిగిరి నీలకంఠ మాట్లాడుతూ పూజారిని అనవసరంగా దుర్భాషలాడి కించపరిచడం తగదని, ఇలాంటివి పునరావృతం కాకుండా నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు చిన్నతుంబళంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో రెండు రోజుల పాటు గురు, శుక్ర వారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొంటారని మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

జగనన్న కాలనీకి నీరు సరఫరా

పెద్దకడబూరు : స్థానిక జగనన్న కాలనీలోని బోరుకు మోటారు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేశామని సర్పంచ్ రామాంజనేయులు బుదవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతుండడంతో నిర్మాణం కోసం నీరు అవసరమని లబ్ధిదారులు కోరడంతో వైఎస్సార్ సీపీ మండల నాయకులు పురుషోత్తంరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన సహకారంతో బోరుకు మోటారు అమర్చామని చెప్పారు.

బీమా తక్షణ సాయం అందజేత

కౌతాళం: మండల కేంద్రానికి చెందిన లడ్డు ఆదాం ఈనెల 14న మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమాకు అర్హుడు కావడంతో బీమా తక్షణ సాయం కింది మృతుడి నామిని అయిన భార్య రేష్మకు రూ.10వేలను సర్పంచ్ పాల్‌దినకర్ బుధవారం అందజేశారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ ఉప సర్పంచ్ ఉమపతి, రాజ్‌అహ్మద్ పాల్గొన్నారు.

మాధవరం స్టీల్ ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలి

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలో ఉన్న మారుతి ఇస్పాత్ ఐరన్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే విషవాయును నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మంత్రాలయానికి వచ్చిన ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ నుంచి ఉద్గారాలు వెలువడి పంటలు, తాగునీరు, పశువులు తినే మేత కూడా కలుషితం అవుతున్నాయని చెప్పారు. అలాగే సూగూరు ఎస్ఎస్ ట్యాంకు ద్వారా చెట్నేహళ్లి, సూగూరు, బూదూరు తదితర గ్రామాలకు తాగునీటి సరఫరా చేయించాలని విజ్ఞప్తి చేశారు.

వేగం..కచ్చితత్వం

- ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్త నిర్ధారణ పరీక్షలకు అధునాతన యంత్రం
- రూ.20 లక్షల వ్యయంతో ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్స్‌ఎల్–640 మిషన్ ఏర్పాటు
- దీని ద్వారా 640 రకాల రక్తనిర్ధారణ పరీక్షలు
- రోగులకు తప్పిన ఇబ్బందులు

పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ముఖ్యంగా నాడు–నేడుతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు, మందులు, భవనాలు ఇలా ఒకటేమిటి..అన్ని రకాల అధునాతన వసతులను సమకూర్చింది. వైద్యం కోసం ఆసుత్రికి వచ్చే నిరుపేదలకు ఇక్క రూపాయి కూడా ఖర్చు కాకూడదని.. రక్తపరీక్షల నిర్ధారణ కోసం అత్యంత ఆధునిక యంత్రం ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్స్‌ఎల్–640 ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసింది. దీని ద్వారా 640 రకాల రక్తపరీక్షలను చేయొచ్చు. అలాగే గంటకు 640 పరీక్షలను చేసే అవకాశముంది. దీని ద్వారా వేగంగా, ఖచితమైన ఫలితాలను ఇస్తుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పాయి.





ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్స్‌ఎల్–640 మిషన్‌లో రక్త పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు, రోగుల వద్ద రక్తం తీసుకుంటున్న టెక్నీషియన్‌లు

ఆదోని అర్బన్ : విలువైన వైద్యాన్ని చేయించుకోలేక పోతున్న పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకు మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నాడు నేడుతో ఆసుపత్రుల రూపురేఖలు మార్చడంతో పాటు సకల వసతులు అందుబాటులో ఉంచారు. అలాగే పేద రోగులకు ఆధునిక, నాణ్యమైన, వేగంగా సేవలందేలా అత్యాధునిక యంత్రాలను సమకూరుస్తుంది. రక్త నిర్ధారణ పరీక్షల ఫలితాలు వేగంగా, కచ్చితంగా వచ్చేలా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రూ. 20లక్షలు వెచ్చించి ఫుల్లీఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్స్‌ఎల్–650 యంత్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ మిషన్ ద్వారా 640 రకాల రక్త ఇతర పరీక్షలను చేయవచ్చు.

ఏయే రకాల పరీక్షలంటే..

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్స్‌ఎల్–640 మిషన్ ద్వారా కిడ్నీ, లివర్, షుగర్, బీపీ, హెచ్‌బీ, సోడియం, పొటాషియం, క్యాల్షియం, కొలెస్ట్రాల్, ప్లేట్‌లైట్లు, హెచ్‌బీఏ1సీ, పెరాలసిస్, స్నేక్ బైట్ వారికి విషయం ఎక్కిందా లేదా తదితర పరీక్షలు చేస్తారు. ఇలాంటి ఖరీదైన పరీక్షలను సైతం ఉచితంగా చేస్తున్నారు. ఇది పేద రోగులకు ఊరట కల్పిస్తోంది.

గతంలో ప్రైవేట్ ల్యాబుల్లోనే..

టీడీపీ పాలనలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ల్యాబ్‌ల నిర్వహణ అధ్వానంగా ఉండేది. దీంతో ఆస్పత్రులకు వచ్చే రోగులు, గర్భిణులు రక్త పరీక్షల కోసం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి రావడంతో వేలాది రూపాయలు చేతి నుంచి కట్టాల్సి వచ్చేది. ఒక కార్డియాలజీ టెస్టుకు రూ.2,500, పెరాలసిస్, స్నేక్‌బైట్, బ్లడ్ కాట్ కోసం రూ.వెయ్యి, హెచ్‌బీఏ1సీకి రూ.600, సీకేఎండీ రక్త పరీక్షకు రూ.వెయ్యి ఇలా తదితర పరీక్షలకు వేలాది రూపాయాలు ప్రజలు ఖర్చు చేసేవారు. ఇలాంటి భారం ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా 640 రకాల రక్త నిర్ధారణ పరీక్షల కోసం అధునాతన యంత్రాన్ని సమకూర్చడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

రోజుకు 600 ఓపీలు..

స్థానిక ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజూ 500 నుంచి 600 ఓపీలు వస్తాయి. ఇందులో 70 నుంచి 100 మందికిపైగా రక్త నిర్ధారణ పరీక్షల కోసం వైద్యులు పంపుతారు. వీరిలో ఒక్కొక్కరికి నాలుగు నుంచి ఐదు రకాల పరీక్షలను నిర్ధారణ చేయాలని వైద్యులు పేర్కొంటారు. ఇలా రోజుకు దాదాపు 700 రకాల ఈ యంత్రం ద్వారా రక్త పరీక్షలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా..ఈ మిషన్ ద్వారా గంటకు 640 రక్త నిర్ధారణ పరీక్షలు చేయవచ్చు. ఆసుపత్రికి వచ్చే వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపకుండా స్థానికంగానే పరీక్షలు నిర్వహించి రిపోర్టు అందజేస్తారు.

రోజుకు వంద మందికి రక్త పరీక్షలు

ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని రకాల రోగులకు ఫుల్లీ ఆటోమేటిక్ ఎనలైజర్ ఎక్స్‌ఎల్–640 మిషన్ ద్వారా రక్త నిర్ధారణ పరీక్షలు చేసే సౌకర్యం ఉంది. ప్రతిరోజూ 70 నుంచి 100 మంది వరకు రక్త పరీక్షల కోసం వస్తున్నారు. వారికి పైసా ఖర్చు లేకుండా ఉచితంగా, వేగంగా కచ్చితత్వంతో కూడిన ఫలితాలు ఇస్తున్నాం. ఏ సమస్యకు అయినా పరీక్షలు చేసే ఆధునిక యంత్రం ఇది. పరీక్షల కోసం మర్ని బయోకెమికల్స్ కిట్లు కూడా వచ్చాయి.

– అనిత, సీనియర్ ల్యాబ్‌టెక్నీషియన్

గతంలో ఇలాంటి సౌకర్యం లేదు



గతంలో ఇలాంటి టెక్నాలజీతో కూడిన మిషన్లు లేవు. ఒక్క పరీక్ష చేయాలంటే 12 గంటలు, ఒక్కోసారి లేదా 24 గంటలు సమయం పట్టేది. ప్రస్తుతం రోగులకు అలాంటి అసౌకర్యం లేదు. వేగంగా రక్త నిర్ధారణ పరీక్షలు చేసి కచ్చితత్వంతో కూడిన రిపోర్టు ఇస్తున్నాం.

– మురళీధర్, ల్యాబ్‌టెక్నీషియన్

ఉచితంగా పరీక్షలు చేశారు



ప్రభుత్వ ఆస్పత్రిల్లో అన్నిరకాల రక్త పరీక్షలను ఉచితంగా చేశారు. ఎలాంటి ఇబ్బందులు పెట్టకుండా రక్తం తీసుకొని పరీక్షలు చేసి రిపోర్టు అందజేశారు. ఇవే పరీక్షలకు ప్రైవేట్ ల్యాబ్‌ల్లో రూ.వేలల్లో ఖర్చయ్యేది. రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల వైద్యపరీక్షలు ఆస్పత్రుల్లో ఉచితంగా చేసేలా అధునాతన యంత్రాలు అందజేయడం అభినందనీయం.

– సిద్దేష్, ఆదోనివాసి

ఓటర్ల నమోదు ప్రక్రియ



దండిగేరిలో సర్వే చేస్తున్న బీఎల్‌ఓ, బీఎల్‌ఏలు

ఆదోనిటౌన్: పట్టణంలోని నాలుగో వార్డు గోకారి జెండా, వార్డు సచివాలయం పరిధిలో ఓటరు నమోదు ప్రక్రియ జోరుగా సాగుతోంది. బూత్ లెవెల్ ఆఫీసర్ వినోద్, బూత్ లెవెల్ అసిస్టెంట్ గోవింద రావు నాలుగు రోజులుగా సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.152,153 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహించిన సర్వేలో కొత్తగా ఓటర్‌లు 60 మందిని చేర్చామని, చనిపోయిన వారు 74 మందిని తొలగించామని బీఎల్‌ఓ వినోద్ బుధవారం తెలిపారు. 2024 జనవరి నాటికి 18 సంవత్సాలు నిండే యువతను గుర్తిస్తున్నామని చెప్పారు. చనిపోయిన వారి ఓటర్‌లను డెత్ సర్టిఫికెట్ ఆధారంగా, సచివాలయం ఉద్యోగులు వారి బంధువుల సమక్షంలో విచారణ చేసి తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థినికి ఎస్పీ అభినందన



నవ్యను అభినందిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

కౌతాళం: స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థిని నవ్యను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అభినందించారని ప్రిన్సిపాల్ పుష్పలత తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులు మంగళవారం కర్నూల్‌లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పది విద్యార్థినుల బృందం పాల్గొంది. అందులో 9వ తరగతి చదువుతున్న నవ్య ఆధ్వర్యంలో మార్చ్ ఫాస్ట్ పెరేడ్ కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. అనంతరం ఎస్పీ కృష్ణకాంత్ నవ్యకు మెడల్ అందించి అభినందించారని వివరించారు.

ఓర్వలేకనే... టీడీపీ దుష్ప్రచారం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ లబ్ధి
- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యం
- తెలుగు తమ్ముళ్లకు దిక్కుతోచక అసత్యారోపణలు
- ధ్వజమెత్తిన మంత్రి గుమ్మనూరు జయరాం



మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాన ప్రాధాన్యతినిస్తున్నారని, ఆ దిశగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని, ప్రజలు మేలు జరుగుతుంటే ఓర్వలేక టీడీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో తనను కలిసిన విలేకరులతో మంత్రి మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా పేదలందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందని, దీంతో అయోమయానికి గురైన టీడీపీ అధినేత కుట్ర రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. బాబుకుతోడు పవన్‌కళ్యాణ్ కూడా తాము ఉన్నామని నిరూపించుకునేందుకు శాంతిభద్రతకు విఘాతం కలిగించేలా ఉద్రేక పూరిత ప్రసంగాలు చేస్తూ రెచ్చగొడుతున్నారన్నారు. బాబుకు తగ్గట్టుగానే టీడీపీ నాయకులు సైతం అదేబాటలో పయనిస్తూ చిన్నపాటి విషయాలను పెద్దవిగా అల్లుతూ పచ్చమీడియాతో పిచ్చిరాతలు రాయిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అంటే ఓ కుటుంబం అని, చిన్నచిన్న సమస్యలు రావడం సహజమన్నారు. అయితే టీడీపీ నాయకులు ఏదో జరిగిపోయిందని, దుష్ప్రచారం చేస్తూ కుట్రలు పన్నుతున్నారన్నారు. తన హయాంలో ప్రజలతోపాటు పార్టీ శ్రేణులకు న్యాయం చేసేలా ముందుకు సాగుతున్నానని, పార్టీ నిర్ణయం, తన సహకారం మేరకు ప్రజాప్రతినిధులుగా కూడా ఎంపికయ్యారని గుర్తు చేశారు.

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌వి పగటి కలలు...

టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని పగట కలలు కంటున్నారని మంత్రి గుమ్మనూరు ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టేందుకే సెల్ఫీ అంటూ బాబు... బస్సు యాత్ర అంటూ పవన్ బుస్స కొడుతున్నాడని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఏమి చేస్తామనే విషయాన్ని చెప్పకుండా... కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించేందుకే అన్నట్టుగా ఉంది వారి వ్యవహారం అని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వనివి కూడా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని గుర్తు చేశారు. సీఎంతోపాటు, మంత్రులు, ఎమ్మెల్యేలను విమర్శించడమే లక్ష్యంగా బాబు, పవన్ ముందుకు సాగుతున్నారని, ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తే అధికారం వస్తుందా అని ప్రశ్నించారు. వీరు ఎంత గీకొట్టినా ప్రయోజనం శూన్యం అని, వీలైతే వాస్తవాలు మాట్లాడి ప్రజల అభిమానాన్ని పొందాలని సూచించారు.

ఉత్సవాలకు భారీ బందోబస్తు

- అన్ని చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు
- ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో భారీ బందబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య తెలిపారు. బుధవారం ఉరుకుందకు బందబస్తు కోసం వచ్చిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రంలో కేటాయించిన స్థలాల్లో సిబ్బంది బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. అనుమానితుల్ని వెంటనే అదుపులో తీసుకోవాలని, ఎక్కడా ఎలాంటి సంఘటలను జరుగకుండా చూడాలని సూచించారు. క్షేత్రానికి నాలుగు వైపులా పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాలు ఏర్పాటు చేశామని, వాహనదారులు ఆ స్థలాల్లోనే తమ వాహనాలను పార్కింగ్ చేసేలా చూడాలని చెప్పారు. క్యూలైన్‌లు, ప్రసాదం విక్రయ కేంద్రాలు, అన్నదానం కేంద్రం వద్ద ప్రత్యేక బందబస్తు ఉంటుందని, అలాగే బస్టాండ్ ప్రాంతంలో, వివిధ అంగళ్ల సముదయాల వద్ద కూడ పోలీసులు నిరతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు కోసిగి సీఐ ఎరిషావలితో పాటు మరో నలుగురు సీఐలు, కౌతాళం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డితో పాటు మరో 8మంది ఎస్ఐలను, 25మంది ఏఎస్ఐలను, 60మంది పోలీసులను, 35మంది హోంగార్డులను బందోబస్తుగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. దేవాలయం వద్ద 50 సీసీ కెమెరాలతో పాటు అదనంగా మరో 20 సీసీ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రెండవ, మూడవ సోమవారాల్లో వంద మంది ఎన్‌సీసీ విద్యార్థుల సేవలను కూడా ఉపయోగించుకుంటమన్నారు. ఇప్పటికే కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అక్కడ ఫిర్యాదు చేయాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కోసిగిలో కొండను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

కోసిగి: మండల కేంద్రంలో తిమ్మప్ప కొండల్లో చిరుతల సంచారిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మణీంద్ర నాయుడు సూచించారు. బుధవారం సిబ్బందితో కలిసి చిరుతలు సంచరిస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. ముందుగా సతమ్మవ్వ గుడి సమీపంలో గొర్రెల కాపరి నరసప్పతో కలిసి చిరుత గొర్రెను ఎత్తికెళ్లిన సంఘటన గురించి ఆరా తీశారు. మంగళవారం సాయంత్రం రెండు చిరుతలు కొండ కిందకు రావడంతో తాము పెద్దగా కేకలు వేస్తే కొండలోకి పరుగులు తీశాయని చెప్పారు. కొండల్లోకి వెళ్లి చూసే సరికి ఒక గొర్రెను పూర్తి గా తినేశాయని, కేవలం పొట్ట భాగం మాత్రమే మిగిలి ఉందన్నారు. కొండలకు చుట్టు పక్కల గొర్రెలు, మేకలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అయితే కొండ పరిసరాలు పరిశీలించే సమయంలో కొండలో నుంచి రెండు చిరుతలు బయటకు వచ్చాయి. వాటిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. విషయాన్ని జిల్లా అధికారులకు సమాచారం చేరే వేశారు. బీట్ ఆఫీసర్ అనురాధ, కుప్పగల్ ఫారెస్ట్ గార్డ్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు విరాళం



ఆలయ నిర్వాహకులకు విరాళం అందిస్తున్న దాతలు

ఆదోనిఅర్బన్ : పట్టణ శివారులోని కోటనగర్‌లో వెలిసిన శ్రీ కోట చంద్రమౌళేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ కోసం దాత బోయ లక్ష్మి రూ.2.50 లక్షలు ఆలయ నిర్వాహకులకు బుధవారం అందజేశారు. ఈ మేరకు ఆలయ అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు మహేష్, సభ్యులకు వాల్మీకినగర్‌కు చెందిన బోయ లక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి రూ.2.50 లక్షలు నగదు అందజేశారు. అంతకు ముందు చంద్రమౌళేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, భస్మం, పూల అలంకరణ, నైవేద్యంతో ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నహరివాణం గ్రామంలో రామయ్య అనే వ్యక్తి తన ఇంటి వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. రామయ్య నుంచి 90 ఎం.ఎల్. పరిమాణం గల 187 ఓసీ టెట్రా ప్యాకెట్లను స్వాధీ నం చేసుకొని, రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

కల్తీకల్లు తాగి యువకుడి మృతి?



చాకలి హనుమంతు (ఫైల్)

ఆదోనిరూరల్ : మండలంలోని మదిరె గ్రామంలో చాకలి హనుమంతు(35) అనే యువకుడు మంగళవారం రాత్రి కల్తీ కల్లు తాగి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. స్నేహితులతో కలిసి మంగళవారం సాయంత్రం గ్రామ శివారు హైస్కూల్ వద్ద కల్తీ కల్లుతాగి మృత్యువాత పడ్డాడన్నారు. మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తల్లిదండ్రులు వాపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయంపై ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులను వివరణ కోరగా, మృతి తమ దృష్టికి రాలేదని చెప్పారు.

వాహనాల షెడ్ తనిఖీ

ఆదోనిటౌన్ : మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ సెక్షన్‌కు సంబంధించిన వాహనాల షెడ్‌ను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. శానిటరీ సెక్షన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, మంజునాథ్, మేస్త్రీలు, సూపర్‌వైజర్‌లతో మాట్లాడుతూ..వాహనాలు ఎన్ని ఉన్నాయి, కండీషన్‌లో ఉన్నవి ఎన్ని, రిపేరీలోవాహనాలు ఎన్ని, రోజుకు ఎంత చెత్త కాంపోస్టు యార్డులకు తరలిస్తున్నాయని, ఎంత మిగులుతోందనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాహనాలకు మరమ్మతులు చేయాల్సి వస్తే వెంటనే చేయించుకోవాలని అధికారులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

కోసిగి: మండలంలోని నేలకోసిగి గ్రామానికి చెందిన నాగప్ప అనే వ్యక్తి బైక్ అదుపు తప్పి కిందకు పడి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కోసిగిలో పనులు ముగించుకుని బుధవారం రాత్రి బైక్ పై స్వగ్రామం వెళ్తుండగా గ్రామ శివారులో అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలతో రోడ్డు ప్రక్కనే స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వారు కోసిగి పీహెచ్‌సీ తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం 108లో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



హెలిప్యాడ్ మైదానం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

మంత్రాలయం రూరల్: మంత్రాలయంలో ఈ నెల 29వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రాఘవేంద్ర స్వామి 352 ఆరాధనోత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. బుధవారం మంత్రాలయంలో పర్యటించి తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు, మఠం అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం వాహనాల పార్కింగ్ కోసం ఎంపిక చేసిన హెలిప్యాడ్ మైదానాన్ని అధికారులతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. భక్తులకు దర్శనం, వసతి, ఉచిత భోజనాలు, తుంగభద్ర నదిలో స్నానాలతో పాటు వాహనాలు నిలిపే ప్రాంతాల్లో భక్తులకు అసౌకర్యం కలిగించకుండా అన్ని శాఖల అధికారులు మఠం అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పరిశుభ్రత, వైద్య సౌకర్యం, దొంగతనాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కట్టుదిట్టమైన భద్రతను కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రముఖులకు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో మరింత నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరీ, విద్యుత్తు ఏఈ గోవిందు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, జోనల్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఇంజినీర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

ఆదోనిఅర్బన్ : స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఆదోని గ్రీనరీ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఆజాదీకా అమృత్ మహోత్సవం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుల సేవలను కొనియాడుతూ ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల జ్ఞాపకార్థంగా దాదాపు 200 మొక్కలను నాటారు. సంస్థ సభ్యులు విట్టా రమేష్, విట్టా రాధిక, లలిత, వినీత, కోమల, హరిత మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల పోరాట ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. వారి సేవలు మరువలేనివన్నారు. అనుక్షణం వారిని స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఆదోని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ డివిజనల్ ఆఫీసర్ జొనాథన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించండి



పెద్దతుంబళంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్దతుంబళం, 104బసాపురం గ్రామాల్లో జరుగుతున్న వార్డుమెంబర్ ఉప ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి కోరారు. బుధవారం రాత్రి ఆయా గ్రామాల్లో పర్యటించి, అన్ని పార్టీల నాయకులు, ప్రజలతో సమావేశమయ్యారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నిక జరిగేలా చూడాలన్నారు. ఎవరైనా ఘర్షణలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి, పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య, ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.